సాక్షి పెద్దపల్లి

గురువారం । 25 ఏప్రిల్ । 2024



వైభవం.. నృసింహుని కల్యాణం

జూలపల్లి : పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు రథోత్సవం జరిగింది. భక్తులు, ఎమ్మెల్యే విజయరమణారావు పూజలు చేశారు.



రామయ్య రథోత్సవం ప్రారంభం

ఇల్లందకుంట: శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చంద్రరథోత్సవం బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది.

గరిష్టం/కనిష్టం
42.4/25.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగలు ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. వడగాలులు వీచే అవకాశంఉంది.

న్యూస్‌రీల్

ప్రణాళిక బద్ధంగా లక్ష్య సాధన



మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

గోదావరిఖని: ప్రణాళికబద్ధంగా వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని సింగరేణి సీఎండీ బలరాం సూచించారు. రామగుండం రీజియన్‌లోని నాలుగు ఏరియాల అధికారులతో బొగ్గు ఉత్పత్తిపై బుధవారం ఆయన సమీక్షించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆర్జీ–1, 2, 3, ఏపీఏ ఏరియాల వారీగా నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి సాధించాలన్నారు. ఉత్పత్తి, రవాణా, ఓబీ మట్టి తొలగింపుపై ఏరియాల వారీగా సమీక్షించారు. భూగర్భ గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యల గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. జీఎంలు శ్రీనివాస్, సూర్యనారాయణ, సుధాకర్‌రావు, ప్రాజెక్టు అధికారులు చంద్రశేఖర్, బానోతు సైదులు, చిలక శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

‘ప్రమాద బీమా’లో చేరండి



రికార్డులు పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

ధర్మారం(ధర్మారం): వ్యవసాయ మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే కూలీలు ప్రమాద బీమా పథకంలో చేరాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌లాల్‌ప్రసాద్ సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్, దొంగతుర్తిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. కొనుగోలు చేసిన ధాన్యం, మిల్లర్లు పంపించిన ట్రక్ షీట్లు పరిశీలించారు. కార్మిక శాఖ అధికారితో మాట్లాడి కూలీలకు ఉచితంగానే బీమా సౌకర్యం కల్పిస్తామని అన్నారు. మేడారం సింగిల్‌విండో కార్యదర్శి రాసూరి మల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులంలో సీట్ల కేటాయింపు



డ్రా తీస్తున్న ఆర్‌ఎల్‌సీ సురేశ్

జ్యోతినగర్(రామగుండం): తెలంగాణ బాలుర మైనార్టీ రెసిడెన్షియల్ హైస్కూల్‌లో డ్రా పద్ధతిన సీట్లు కేటాయించారు. ఎన్టీపీసీ నర్రాశాలపల్లె రోడ్డులోని ఇంజినీరింగ్ కళాశాలలో రెసిడెన్షియల్ హైస్కూల్ కొనసాగుతోంది. ఐదో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ విద్యార్థులకు బుధవారం డ్రా పద్ధతిన సీట్లు కేటాయించారు. రీజినల్ లెవల్ కో ఆర్డినేటర్ సురేశ్ బుధవారం ఈ ప్రక్రియ చేపట్టారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సీట్లు కేటాయించామని, డ్రాలో సీటు దక్కించుకున్న వారు ఈనెల 30వ తేదీలోగా ధ్రువీకరణ పత్రాలతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించి ప్రవేశం పొందాలని సూచించారు. 30వ తేదీ తర్వాత వెయిటింగ్ జాబితాలో ఉన్న వారికి సీట్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ప్రిన్సిపాల్ శ్రీధర్, స్కూల్ కో ఆర్డినేటర్ గోపి, సీనియర్ పీజీటీ రాజనారాయణ, టీజీటీ శంకర్, స్కూల్/హాస్టల్ వార్డెన్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించొద్దు



చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న గంగయ్య

ఓదెల(పెద్దపల్లి): నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పెద్దపల్లి నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి గంగయ్య హెచ్చరించారు. గుంపుల చెక్‌పోస్టును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాలను తనిఖీలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అధికారులు పాల్గొన్నారు.

పెద్దపల్లి బాలికల హవా..

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. సెకండియర్(బైపీసీ)లో సానియా 827, ఎంపీసీలో అశ్విత 750, ఫస్టియర్(బైపీసీ)లో అఫ్షాన్ 369, రత్నకుమారి 365 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ మైత్రేయి వివరించారు. వొకేషనల్ కోర్సుల్లో ముత్యాల సౌమ్య 965, శ్రీనిత 952 మార్కులు, ఫస్టియర్‌లో సాత్విక 452, అశ్విత 438 మార్కులు సాధించారని వివరించారు.

భళా.. బాలిక



- ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన బాలికలు
- సెకండియర్ కన్నా తక్కువగా ఫస్టియర్ రిజల్ట్స్
- అగ్రభాగంలో కరీంనగర్, ఆఖరున పెద్దపల్లి
- ఒకేషనల్‌లో అగ్రభాగంలో నిలిచిన పెద్దపల్లి

ప్రథమ సంవత్సరం విద్యార్థుల హాజరు.. ఫలితాలు

జిల్లా	హాజరు	ఉత్తీర్ణత	శాతం
కరీంనగర్	15,058	9,548	63.41
రాజన్నసిరిసిల్ల	3,542	2,047	57.79
జగిత్యాల	5,717	2,955	51.69
పెద్దపల్లి	4,120	1,908	46.31

ద్వితీయ సంవత్సరం

జిల్లా	హాజరు	ఉత్తీర్ణత	శాతం
కరీంనగర్	13,407	9,974	74.39
రాజన్నసిరిసిల్ల	3,180	2,083	65.05
జగిత్యాల	5,741	3,691	64.29
పెద్దపల్లి	4,007	2,377	59.32

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో బాలికలు సత్తాచాటారు. బుధవారం ప్రకటించిన మొదటి, రెండో విద్యా సంవత్సర ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్ రాష్ట్రంలోనే 5వ, 4వ ర్యాంకులు సాధించి సత్తా చాటింది. సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో తక్కువ ఫలితాలు నమోదవడం గమనార్హం. మొదటి సంవత్సరం విద్యార్థుల కన్నా రెండో సంవత్సరం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మొత్తంగా ఇంటర్ రెండు విద్యా సంవత్సరాల్లో కరీంనగర్ అగ్రభాగం దక్కించుకోగా, ఆఖరుస్థానంలో పెద్దపల్లి, రెండు, మూడు స్థానాల్లో సిరిసిల్ల, జగిత్యాల నిలిచాయి. రెగ్యులర్ ఇంటర్‌లో ముందంజలో ఉన్న కరీంనగర్ ఒకేషన్‌లో వెనకబడగా, పెద్దపల్లి జిల్లా ఒకేషనల్‌లో అగ్రభాగాన నిలవడం గమనార్హం.

బాలికలదే పైచేయి..

మొదటి సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో కరీంనగర్ 5వ స్థానంలో, రాజన్నసిరిసిల్ల 13వ, జగిత్యాల 25వ, పెద్దపల్లి 31వ స్థానంలో నిలిచాయి. సెకండియర్ ఫలితాల్లో కరీంనగర్ నాలుగోస్థానం, రాజన్నసిరిసిల్ల 15వ, జగిత్యాల 21వ, పెద్దపల్లి 31వ స్థానం దక్కించుకున్నాయి. ఈ ఫలితాల్లోనూ బాలికలే హవా చాటారు. కరీంనగర్‌లో బాలురు 56.13శాతం, బాలికలు 63.41 శాతం, సిరిసిల్లలో బాలురు 45శాతం, బాలికలు 57.79శాతం, జగిత్యాలలో బాలురు 36శాతం, బాలికలు 51.69శాతం, పెద్దపల్లిలో బాలురు 31.45, బాలికలు 46.31శాతం మేర ఫలితాలు సాధించారు.

ఒకేషనల్‌లో ఇలా

ఉమ్మడి జిల్లాలో ఒకేషనల్ మొదటి సంవత్సరంలో పెద్దపల్లి 50.92శాతం, సిరిసిల్ల 47.73శాతంతో తొలి, రెండోస్థానాలు దక్కించుకోగా, జగిత్యాల 44.15శాతం, కరీంనగర్ 42.64 శాతంతో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఒకేషనల్ రెండో సంవత్సరంలో పెద్దపల్లి 63.55శాతం, రాజన్నసిరిసిల్ల 63.01శాతం, కరీంనగర్ 57.62శాతం, జగిత్యాల 55.89శాతం ఫలితాలు సాధించాయి.

- మైనార్టీ జూనియర్ కళాశాలల్లో పెద్దపల్లి 74.63శాతం, కరీంనగర్ 72.46శాతం, జగిత్యాల 71.21శాతం. సిరిసిల్ల 53.66శాతం ఫలితాలు సాధించాయి.
- మోడల్ స్కూళ్లలో పెద్దపల్లి 49.83శాతం, కరీంనగర్ 47.61శాతం, జగిత్యాల 58.96శాతం, సిరిసిల్ల 59.29శాతం ఫలితాలు నమోదు చేశాయి.
- ఇక ప్రభుత్వ జూనియర్ కళాశాలల విషయానికి వస్తే పెద్దపల్లి 35.57శాతం, కరీంనగర్ 36.14శాతం, జగిత్యాల 38.59 శాతం, సిరిసిల్ల 46.86 శాతం ఉత్తీర్ణతను సాధించాయి.

బైపీసీలో శ్రీనిధి జిల్లా టాపర్..



శ్రీనిధి

కమాన్‌పూర్(మంథని): గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియెట్ బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి రాధారపు శ్రీనిధి 985 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. ప్రథమ సంవత్సరంలో 440/436 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎ.వైష్ణవి 470/440 మార్కులు సాధించింది. కాలేజీలో ప్రథమ సంవ్సరంలో 46శాతం, ద్వితీయ సంవత్సరంలో 46శాతం ఉత్తీర్ణత నమోదైంది. శ్రీనిధి, వైష్ణవిని ప్రిన్సిపాల్ సునంద, అధ్యాపకులు అభినందించారు.

నామినేషన్ల జోరు



ఆర్వో ముజమ్మిల్‌ఖాన్‌కు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్

- ఆరు రోజుల్లో 41మంది అభ్యర్థుల నామినేషన్
- ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్ దాఖలు పూర్తి
- నేటితో ముగియనున్న నామినేషన్ గడువు

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి నామినేషన్ల జోరు కొనసాగుతోంది. బుధవారం మంచిరోజు కావడంతో బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌తోపాటు మరో 11మంది 13సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అంజదేశారు. దీంతో ఆరురోజులు కలుపుకుని ఇప్పటివరకు 41మంది అభ్యర్థులు 55సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. గురువారంతో నామినేషన్ల దాఖలు గడువు ముగియనుంది. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ ర్యాలీలు, అగ్రనేతల సమక్షంలో మరోసెట్ నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. చిన్నాచితక పార్టీలు, స్వతంత్రులు సైతం చివరిరోజు నామినేషన్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో గతంలో కంటే ఈసారి భారీగా నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బుధవారం 12 మంది..

- పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి బుధవారం 12 మంది అభ్యర్థులు 13 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.
- బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి ఇరుగురాల భాగ్యలక్ష్మి, యువతరం పార్టీ అభ్యర్థి చిలుక ఆనంద్ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలుచేశారు.
- అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులు రాచర్ల రాజేశం, నీరటి శంకర్, నవీన్ నూకల, దుర్గం రాజ్‌కుమార్, కుర్మ మహేందర్, మోటం రవీందర్, బూడిద తిరుపతి, కాశీ సతీశ్‌కుమార్, చందనగిరి శ్రీనివాస్ ఒక్కోసెట్ నామినేషన్ ప్రతాలను ఆర్వో ముజమ్మిల్‌ఖాన్‌కు సమర్పించారు.

బీజేపీ బీఫారంపై ఉత్కంఠ

ఎంపీ అభ్యర్థులను ప్రధాన పార్టీలు నెల క్రితమే ప్రకటించాయి. దీంతో తొలిరోజు బీఆర్‌ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ రెండేసి సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ బుధవారం రెండు సెట్లు వేయగా, గురువారం కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, అశ్విన్ వైష్ణవ్ సమక్షంలో మరోసెట్ వేస్తానని మీడియాకు తెలిపారు అయితే, బీజేపీ నుంచి పోటీచేసేందుకు సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్‌నేత తన వంతు ప్రయత్నాలు చేస్తుండడంతో గోమాస శ్రీనివాస్‌కు బీఫారం దక్కేనా? లేక చివరి నిమిషంలో వెంకటేశ్‌నేతకు దక్కేనా? అనే ఉత్కంఠ నెలకొంది.

గోమాస ఆస్తులు రూ.23.22కోట్లు

పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ తనకు రూ.23.22కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. నగదు రూ.2లక్షలు, తన భార్యకు రూ.1.5లక్షల నగదు ఉన్నట్లు తెలిపారు. అలాగే తనకు 10తులాల గోల్డ్‌చైన్, తన భార్యకు 35తులాల బంగారం, రెండు గోల్డ్‌చైన్లు, రెండు గాజులు, రెండు చెవిపోగులు ఉన్నట్లు చూపారు. తనపేరిట చరాస్తులు రూ.54.50లక్షలు, తన భార్య పేరిట రూ.27.75లక్షలు ఉన్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన పేరిట రూ.64 హోమ్‌లోన్ ఉన్నట్లు ఆయన చూపారు. అలాగే తన పేరిట 4.27ఎకరాల వ్యవసాయ భూమి, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల్లో కలిపి రూ.22.40కోట్ల విలువైన చరాస్తులు ఉన్నట్లు వివరించారు.

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పలు అంశాలపై సమీక్షించారు. పలు సూచనలిచ్చారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక పరిశీలన తదితర అంశాలను నిబంధనలకు లోబడి పరిశీలించాలన్నారు. ఈనెల 29న నామినేషన్ ఉపసంహరణ గడువు పూర్తయ్యాక స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను కేటాయించాలని సూచించారు. ఈవీఎంలపై బ్యాలెట్ పత్రాల కమిషనింగ్‌కు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. మే 13న జరిగే పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు పోలింగ్ స్లిప్పులను అందించాలని అన్నారు. ఆర్డీవో గంగయ్య, డీపీవో ఆశాలత, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ తదితరులు పాల్గన్నారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త

- సీఎంపీఎఫ్‌వో కమిషనర్ హరిపచౌరి



హరిపచౌరి

గోదావరిఖని: సీఎంపీఎఫ్ ఆన్‌లైన్‌లో సైబర్ మోసాలపై రిటైర్డ్ ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని గోదావరిఖని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(సీఎంపీఎఫ్‌వో) కమిషనర్ హరిపచౌరి సూచించారు. బుధవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. సీఎంపీఎఫ్ పూర్తిస్థాయి ఆన్‌లైన్ పోర్టల్ సేవలు ఇటీవల మొదలయ్యాయని పేర్కొన్నారు. అన్ని క్లెయిమ్‌లు ఆన్‌లైన్ ద్వారా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో సైబర్‌మోసగాళ్లు ఈసైట్‌లో చొరబడి డబ్బులు తస్కరిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. సీఎంపీఎఫ్‌వో పూర్తి పారదర్శకత వైపు పయనిస్తోందన్నారు. ఇటీవల వేరే రాష్ట్రంలో పెద్ద మొత్తంలో ఆన్‌లైన్ మోసాలు జరిగినట్లు గుర్తించామన్నారు. కష్టపడిన సంపాదించిన సొమ్ము సైబర్ మోసగాళ్ల పాలైందన్నారు. పుణెలో జరిగిన ఒకసంఘటనలో రిటైర్డ్ ఉద్యోగి రూ.28లక్షలు మోసపోయారని గుర్తుచేశారు. మరో ఘటనలో సీఎంపీఎఫ్ సభ్యుడు రూ.10లక్షలు మోసపోయిన అంశం తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలివే..

- సీఎంపీఎఫ్‌వో ఉద్యోగుల్లా నటిస్తూ ఫోన్‌లు చేసి మోసగిస్తున్నారు.
- ఏటీఎం పిన్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లను ఎవరికీ షేర్ చేయవద్దు
- మొబైల్ స్క్రీన్‌షాట్‌లు, ఇతరులు షేర్ చేసిన లింక్‌లపై క్లిక్ చేయవద్దు
- సీఎంపీఎఫ్‌వో ఏ సభ్యుడినీ, ఎప్పుడూ వివరాలు ఫోన్‌లో అడగదు
- అనుమానిత కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దు
- అవసరమైతే సీఎంపీఎఫ్ కార్యాలయంలో సంప్రదించి సాయం పొందాలి
- వెబ్‌సైట్‌లో కనిపించే చిరునామా, టెలిఫోన్ నంబర్ల ద్వారా సేవలు అందుబాటులో ఉంటాయి.

కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోవద్దు



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్, వేదికపై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తదితరులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కాంగ్రెస్ పార్టీని నమ్మి మరోసారి మోసపోవద్దని పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కోరారు. స్థానిక షిర్కే బస్ స్టాప్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌తో కలిసి బుధవారం పూలమాల వేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం హనుమాన్‌నగర్ భవాని గార్డెన్‌లో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తను ఈ మట్టి బిడ్డనని, 26 ఏళ్లపాటు సింగరేణి కార్మికుడిగా పనిచేశానని అన్నారు. నాయకులు మేడి సదయ్య, మురళీధర్‌రావు, తాళ్ల అమృత, అంజలీదేవి, కిషన్‌రెడ్డి, స్టాలిన్‌గౌడ్, కుమార్ నాయక్, రాంచందర్ ఉన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యప్రసాద్‌రాజ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గురుకుల పాఠశాలలో ఈనెల 18న అల్పాహారం వికటించడంతో 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విచారణ జరిపి అందించిన నివేదిక ప్రకారం.. ప్రిన్సిపాల్ అలసత్వం ఉందని, ప్రాథమికంగా భావించిన కలెక్టర్.. ప్రిన్సిపాల్ ఎస్.సత్యప్రసాద్‌రాజ్‌ను సస్పెండ్ చేశారు. కేర్ టేకర్, అసిస్టెంట్ కేర్‌టేకర్లకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. సంఘటనపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. సస్పెన్షన్ కాలంలో ప్రిన్సిపాల్ సత్యప్రసాద్ అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లవద్దని సూచించారు. గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రామస్వామికి ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

‘ఎవరికీ పైసలు ఇవ్వలేదు’

సాక్షి, పెద్దపల్లి: ఎన్టీపీసీ కుందనపల్లి యాష్ పాండ్ నుంచి నిబంధనల మేరకు బూడిదను ఇటుక బట్టీలకు తరలించుకుంటున్నామని, ఇందుకోసం ఎవరి వద్ద పైసలు వసూలు చేసి ఎవరికీ ఇవ్వలేదని రామగుండం(ఎన్టీపీసీ) క్లే బ్రిక్ మాన్యుఫ్యాక్చరర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలిపింది. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 30ఏళ్లుగా ఎన్టీపీసీ కుందనపల్లి యాష్‌ను ఇటుకల తయారీ కోసం తీసుకెళ్తున్నామని పేర్కొంది. అందులో భాగంగా 2023జూన్‌లో జరిగిన టెండర్‌లో 4.5లక్షల టన్నుల యాష్‌ను దక్కించుకున్నామని పేర్కొంది. దానిని కేవలం ఇటుకల తయారీదారులకే ఎన్టీపీసీ నిబంధనల ప్రకారం విక్రయిస్తున్నామని ఇటుక బట్టీ యజమానుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు హరిశ్చంద్రప్రసాద్ తదితరులు వివరించారు.

అనుమతిలేని ఆస్పత్రులపై చర్యలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. రిజిస్ట్రేషన్, రెన్యూవల్‌లేని ఆస్పత్రుల్లో వైద్యులు సేవలు అందించవద్దని సూచించారు. అనుమతిలేని ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందించే డాక్టర్లపైనా చర్యలు తీసుకునేలా మెడికల్ కౌన్సిల్‌కు సిఫారసు చేస్తామని ఆయన పేర్కొన్నారు. అలాగే స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ దుకాణాల్లో వైద్య నిపుణులు పరీక్షలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. పోర్టబుల్ స్కానింగ్‌మిషన్ అనుమతి లేకుండా ఓ చోటు నుంచి మరోచోటుకు తరలించడం నేరమని పేర్కొన్నారు. వాటిని వినియోగించే వైద్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్లపై మర్డర్లు చేయించి దర్జాగా తిరుగుతున్నారు

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్(మంథని): బీఆర్‌ఎస్ హయాంలో చట్టాన్ని చుట్టంగా చేసుకుని నడీరోడ్డుపై మర్డర్లు చేయించి దర్జాగా తిరుగుతున్నారని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో బుధవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డితో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. చట్టం ఎవరికీ చుట్టం కాదన్నారు. వ్యవస్థలు సరిగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని బయటకు తీసుకొస్తామని అన్నారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లోపించిందని, మంథని – ముత్తారం మండలం ఓడేడ్ మానేరువాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన నాణ్యత లోపంతో కూలిపోతున్నాయని ఆరోపించారు. అవినీతి డబ్బుతో రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించినా ఏ ఒక్కరికీ ప్రతిఫలం అందలేదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హుల దరిచేరుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, మండల అధ్యక్షుడు వైనాల రాజు, కమాన్‌పూర్, పాలకుర్తి సీఏసీఎస్ చైర్మన్‌లు ఇనగంటి భాస్కర్‌రావు, బయ్యపు మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, మాజీ సర్పంచ్‌లు ఆకుల ఓదెలు, మాజీ ఎంపీటీసీ పిల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి

- టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి



రాజిరెడ్డి



కాపు కృష్ణ



మాట్లాడుతున్న రాజిరెడ్డి

గోదావరిఖని: సింగరేణిలో కొత్త గనులు ప్రారంభించి స్థానికులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కొప్పుల లక్ష్మీరాజం సభా ప్రాంగణంలో జరిగిన టీబీజీకేఎస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని కొత్త బొగ్గు బ్లాకులను నేరుగా సింగరేణికి కేటాయించాలన్నారు. సింగరేణి వినియోగించే యంత్ర, సామగ్రి తయారు చేసే అనుబంధ పరిశ్రమలు నెలకొల్పేలా కోల్‌బెల్ట్ ఏరియా యువతను ప్రోత్సహించాలన్నారు. కార్మికులకు కార్పొరేట్ వైద్యం అందించాలన్నారు. కాలుష్య నియంత్రణకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కార్మిక కుటుంబాలకు రక్షిత మంచి నీటిని అందించాలన్నారు. ఓసీపీల్లో పనివేళలు మార్చాలన్నారు. రాష్ట్ర ప్రతినిధుల సభలో 14 అంశాలపై తీర్మానాలను సభికులు ఏకగ్రీవంగా ఆమోదించారు. నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, పర్లపల్లి రవి, మల్రాజు శ్రీనివాసరావు, మేడిపల్లి సంపత్, పెట్టెం లక్ష్మణ్, వడ్డేపల్లి శంకర్, ఐలి శ్రీనివాస్, బడితల సమ్మయ్య, వీరభద్రం, తుమ్మ శ్రీనివాసరావు, నాగెల్లి సాంబయ్య, బడికల సంపత్, జాహిద్ పాషా, చల్ల రవీందర్‌రెడ్డి, ఎల్.వెంకటేశ్ పాల్గొన్నారు. కాటీ, టీజీబీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోదావరిఖనికి చెందిన మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొత్తగూడేనికి చెందిన కాపు కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఇంటర్మీడియెట్‌లో మెరుగైన ఫలితాలను సాధించాయని ఇంటర్ విద్య నోడల్ అధికారి కల్పన తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలలు 48.95శాతం, ప్రైవేట్ కాలేలు 43.36శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. సెకండియర్‌లో ప్రభుత్వ కాలేజీలు 60.6శాతం, ప్రైవేట్ కాలేజీలు 44.6శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయని వివరించారు. కమాన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని శ్రీనిధి 1000 మార్కులకు 985 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారని డీఈవో వివరించారు.

సత్తా చాటిన ప్రభుత్వ కళాశాలలు

- అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు
- పలువురు ప్రముఖుల నుంచి ప్రశంసలు


ఉద్వేశ


రాహుల్


జానవి


మంజు


శ్రేయ


వైష్ణమి


అక్షిత


సుష్మిత


సాయిప్రియ


ఆశ్విత


అమూల్య

మంథని: జిల్లాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. ప్రైవేట్ కాలేజీలకన్నా అధిక మార్కులు సాధించి సవాల్ విసిరాయి. మంచిఫలితాలు సాధించిన విద్యార్థులు పలువురు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

మంథని డివిజన్‌లో..

మంథని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాలలో మొదటి సంవత్సరం(బైపీసీ)లో రామ్‌చరణ్ రామ్‌చరణ్ 372, అజయ్ 351 మార్కులు సాధించారు. ఎంపీసీలో జెట్టి శ్రీనివాస్ 458, జె.సంతోష్ 446, రాజ్‌కుమార్ 441 సాధించారు. అలాగే సెకండ్ ఇయర్(ఎంపీసీ)లో బౌతు అభిషేక్ 956, విద్యాచరణ్ 895, అఖిలాష్ 894, బైపీసీలో పవన్‌కుమార్ 893, అజయ్ 867 మార్కులు సాధించారు. మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలో మొదటి సంవత్సరం(ఎంపీసీ)లో వైష్ణవి, సాహిత్య 441, సౌజన్య 430, బైపీపీలో హర్షిత, మనూష 432 మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్(ఎంపీసీ)లో ఎస్.అక్షిత 972, లతాదేవి 935, బైపీపీలో సానియా 980, నైనా అన్జుమ్ 975 మార్కులు సాధించినట్లు ఇంటర్ విద్య జిల్లా అధికారి కల్పన పేర్కొన్నారు.

ఖనిలో..

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం(ఎంపీసీ)లో డి.శ్రీవాణి 451, బైపీసీలో ఎండీ కరీమా 424, సీఈసీలో జి.ఆశ్రిత 478, హెచ్‌ఈసీలో కె.స్ఫూర్తి 486, సీజీఏలో మునజ్జ 493 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సనాసుహానా 904, బైపీసీలో ఎండీ షిఫా 973, సీఈసీలో కె.సిరి 927 మార్కులు సాధించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో జి.సంతోష్ 894, బైపీసీలో ఇ.అభిషేక్ 798, సీఈసీలో ఎస్‌డీ సానియా 756, హెచ్‌ఈసీలో డి.లక్ష్మణ్ 559, ఉర్దూమీడియం(సీఈసీ) ద్వితీయ సంవత్సరంలో ఫౌజియా బేగం 918 మార్కులు సాధించారు. ఒకేషనల్ రెండోసంవత్సరం(ఏటీ)లో ఆర్.అంజన్ 839, ఐఎంలో ఎస్.నరేశ్ 848, ఏఈటీలో పి.రాఘవేంద్ర 911, సీఎస్‌లో జె.నాగచైతన్య 847, ఈటీలో ఎం.ప్రవీణ్ 821, ఎంఎల్‌టీలో ఎండీ చాంద్‌నీ 947, ఎంపీహెచ్‌డబ్ల్యూలో బండి సంజీర్తన 975 మార్కులు సాధించారు.

ముత్తారంలో..

ముత్తారం(మంథని): ధర్యపూర్ మోడల్ స్కూల్‌కు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులు 85 మందికి 57 మంది ఉత్తీర్ణతతో 67శాతం పాస్ నమోదు చేశారు. సెకండియర్‌లో 97 మందికి 60 మంది ఉత్తీర్ణతతో 63శాతం నమోదు చేసినట్లు ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఫస్టియర్(ఎంపీసీ) గూట్ల ఆశ్వత 450, రాపెల్లి శ్రావణి(ఎంపీసీ) 440, పాలకెట్టి అంజలి(బైపీసీ) 382, బియ్యని సుస్మిత(బైపీసీ) 378, అలకుంట్ల జానవి(సీఈసీ) 471, కుడుకుల శ్రీవల్లి(సీఈసీ) 434 మార్కులు సాధించారు. సెకండియర్‌లో పత్తి అనిల్‌రెడ్డి(ఎంపీసీ) 955, కొరవేన దేహన్‌తనా(బైపీసీ) 932, జనగం సంకీర్తన(సీఈసీ) 926 మార్కులు సాధించారు. కేజీబీవీలో 89శాతం ఉత్తీర్ణ సాధించామని స్పెషలాఫీసర్ కమల తెలిపారు. ఫస్టియర్ సీఈసీలో 15 మందికి 13 మంది ఉత్తీర్ణతతో 87శాతం, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 17మందికి 15 ఉత్తీర్ణతతో 88శాతం, సెకండియర్‌సీఈసీలో 23 మందికి 18మంది ఉత్తీర్ణతతో 78శాతం, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 27మందికి వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేశారన్నారు. ఫస్టియర్‌లో పి.రక్షిత(సీఈసీ) 449, ఎంపీహెచ్‌డబ్ల్యూలో సిలివేరి వరలక్ష్మి, చిగిరి సాత్విక, ఐలి అమూల్య 471 మార్కులు సాధించారు. సెకండియర్‌లో తోటపల్లి రజిత(సీఈసీ) 952, మూట్ల శ్రావ్య ఎంపీహెచ్‌డబ్ల్యూలో 969 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌లో 25శాతం, సెకండియర్‌లో 58శాతం ఉత్తీర్ణత నమోదైంది. సెకండియర్‌లో బి.రష్మిత(సీఈసీ) 674, కె.రాము(హెచ్‌ఈసీ) 595, జి.అభిలాష్(ఎంపీసీ) 811, కె.సుస్మిత 793, ఎన్.సంధ్యారాణి(బైపీసీ)809, ఎ.విష్ణు మాచారి 801 మార్కులు సాధించారు.

బాలికలదే హవా..

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులు 79 మంది పరీక్ష రాయగా 27 మంది, ద్వితీయ సంవత్సరం 92 మందికి 40 మంది, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 25 మందికి 11 మంది, ద్వితీయ సంవత్సరంలో 13 మందికి 10మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు తెలిపారు.

మేదారం గురుకులం బాలుర ప్రతిభ..

ధర్మారం(ధర్మపురి): నందిమేడారం బాలుర గురుకులంలో 94శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో సాయిశ్రీ(ఎంపీసీ) 980 మార్కులు సాధించింది. మల్లాపూర్ గురుకులంలో 84శాతం, ధర్మారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 46శాతం, మోడల్ స్కూల్‌లో 66 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మోడల్ స్కూల్‌లో సాయిస్మృతి(ఎంపీసీ) 979, అంజలి 969 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మన్నెదీనా తెలిపారు.

ప్రైవేట్‌కు దీటుగా..

సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లి మోడల్ స్కూల్ ప్రథమ సంవత్సరంలో 51శాతం, ద్వితీయ సంవత్సరంలో 76శాతం ఉత్తీర్ణత నమోదైంది. శ్రేయ(సీఈసీ) ప్రథమ సంవత్రరంలో462/500, ఎంపీసీలో స్వప్న 439/470, ద్వితీయ సంవత్సరంలో అక్షిత (సీఈసీ) 952/1000, ప్రణతి(హెచ్‌ఈసీ) ద్వితీయ సంవత్సరంలో 843/1000) మార్కులు సాధించారు. సాంఘిక సంక్షేమ గురుకులంలో ద్వితీయ సంవత్సరంలో 83శాతం, ప్రథమ సంవత్సరంలో 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో సుష్మిత(సీఈసీ) 910/1000, ప్రణతి(హెచ్‌ఈసీ) 843/1000 మార్కులు సాధించారు. కాస్తూరిబాలో ద్వితీయ సంవత్సరంలో 92.1శాతం, ప్రథమ సంవత్సరంలో 86.11శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో వైష్ణమి(సీఈసీ)467/500, సాయిప్రియ(ఎంపీహెచ్‌డబ్ల్యూ)లో 486/500, ద్వితీయలో శ్రావ్య(సీఈసీ) 881/1000, మంజు(ఎంపీహెచ్‌డబ్ల్యూ) 935/ 1000 మార్కులు సాధించారు. ప్రిన్సిపాల్స్ రాఘునాథ్, అరుణశ్రీ, స్వప్న విద్యార్థులను అభినందించారు.

జూలపల్లి కస్తూరిబా బాలికల ప్రతిభ

జూలపల్లి(పెద్దపల్లి): స్థానిక మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలుకుంటలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలోని 235 ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 87మంది ఉత్తీర్ణులయ్యారు. 305 సెకండియర్ విద్యార్థులకు 173మంది పాసయ్యారు. మండల టాపర్లుగాగా కేజీబీవీ నుంచి ఎం.అక్షిత(ఫస్టియర్ ఎంపీసీ) 470కి 460 మార్కులు సాధించింది. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో ఎస్.వైష్ణవి 1000కి 966 మార్కులు సాధించింది. ఎంపీసీలో కె.కల్యాణి 1000కి 959 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు.

మల్యాలలో..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మల్యాల మోడల్ స్కూల్‌కు చెందిన తంగళ్లపల్లి రాహుల్ 966/1000 మార్కులు సాధించడంతో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తల్లిదండ్రులు స్వప్న, రాజు అభినందించారు.

ఓదెల మోడల్ స్కూల్ భేష్

ఓదెల(పెద్దపల్లి): స్థానిక మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత నమోదు చేసింది. బండారి స్వప్న(సీఈసీ) ద్వితీయ సంవత్సరంలో 881, ఎంపీసీలో ఉద్వేశ 948 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో 15మంది పరీక్షకు హాజరు కాగా 15మంది, ఎంపీసీలో 40మందికి 39మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీలో 79మందికి 72మంది పాసయ్యారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో సిద్ధార్థ(ఎంపీసీ) 902, బుర్ర అనూష(బైపీసీ) 845 మార్కులు సాధించారు.

మెరిసిన 'అల్ఫోర్స్' విద్యార్థులు


మార్కులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్, మహారాష్ట్రలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో మెరిశారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ట్రైనీటాట్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి టాపర్లను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి సన్మానించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470మార్కులకు గాను టి.శృతి, సి.హెచ్.శ్రీహిత, వి.ప్రణవి, ఏ.శశిప్రీతమ్, కె.వర్షిత్, కె.రుత్విక్, ఎస్.కార్తి కేయ, కె.సృజల్, టి.వర్షిత, యమ్.శ్రీవర్ష, పి.జి.ప్రియామృత, కె.వర్షిణి, ఇ.ప్రసన్న, యమ్.రుత్విక, జి.లక్ష్మిప్రసన్న, కె.అభిలాష్‌లు 468 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. 65 మంది విద్యార్థులు 467 మార్కులు, 117 మంది 466మార్కులతో సత్తాచాటారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 440మార్కులకుగాను బి.నీలిమ 438 మార్కులతో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమస్థానంలో నిలవగా 8మంది 437 మార్కులు, 25 మంది 436మార్కులతో అత్యున్నత స్థానంలో నిలిచారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీలో 500 మార్కులకుగాను టి.అఖిల్ 494మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమర్యాంకులో నిలవగా.. ఎం.సహస్రరెడ్డి 493, వి.అక్షయ్‌వర్ధన్ 493, సీఈసీలో 500 మార్కులకుగాను ఎస్.సృష్టిత 492, బి.గ్రీష్మ 491 మార్కులు సాధించినట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 1000మార్కులకు గానూ కె. కార్తీక్‌బాబు, టి.సాహిత్యలుత 993మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానం నిలవగా, ఎల్.హర్షి త, బి.నిహారిక 992, ఎం.పల్లవి, డి.శివాంజలి, పి. విశ్వాణి, కె.మిత్రా, ఎల్.అస్మిత, మారియామావిన్, జి.ఉమాకాంత్ 991మార్కులతో సత్తాచాటడం సంతోషంగా ఉందన్నారు. బైపీసీలో 1000 మార్కులకుగాను సి.హెచ్. నిఖిల్, బి.అమిత 990, ఏ.శ్రీనిధి మార్కులు సాధించారు. సీఈసీలో ఎం.వినమ్రత, జి.మహేష్‌కుమార్‌లు 974 మార్కులు, నిమ్రా అజ్మీ 978, ఎం.నజీర్ 972 మార్కులు సాధించినట్లు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో 'ట్రినిటి' ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న విద్యా సంస్థల అధినేతలు మనోహర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు

కరీంనగర్: ఇంటర్ ఫలితాల్లో 'ట్రినిటి' విద్యాసంస్థలు ప్రభంజనం సృష్టించాయి. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను ఎ.యశ్వంత్, సీహెచ్ మణిదీప్, బి.వైశాలి, అస్పియా నూరిన్, జి.అజయ్, ఏ.సాత్విక్, టి.రవళి 468 రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులు సాధించారు. షిఫా షకీల్, బి.సాహితి, బి.శ్రావ్య, ఎస్.వైష్ణవి, ఎస్.సంజన, కె.ప్రణతి, పి.శ్రావ్య, బి.హితేష్, డి.మహేశ్, బి.డేవిడ్ రాజు, ఆర్. నవదీప్, ఎస్.మేఘన, ఓ.శ్రీచందన, ఏరం నాజ్, 15 మంది 467మార్కులు, 23 మంది 466 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో 449 మార్కులకు బి.సింధు 438 మార్కులు, జె.అంజనీ, సుమయ్య ఫాతిమా, అనీకా ఇఫ్రాత్, టి.ప్రసన్న, ఆర్.సృజనకుమార్, 5 మంది 437 మార్కులు, 9 మంది విద్యార్థులు 436 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను జి.రమ్య 487 మార్కులు, మేఘనాథ్ 485 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో 500 మార్కులకుగాను రిషిక శర్మ 488 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను బి.ప్రశాంత్ 992 మార్కులు, ఎస్.అభినయ 991 మార్కులు ఎస్.లహరి, పి.శ్రీవిద్య, వి.శ్రీతేజ, టి.ప్రవళిక, జి.మహాలక్ష్మి, ఐదుగురు 990 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో నిదా హర్మిన్, కె.రాణి, మెం జబీన్ 990 మార్కులు సాధించారు. 989 మార్కులు ఆరుగురు, 988మార్కులు నలుగురు సాధించారు. సీఈసీ విభాగంలో 1000 మార్కులకు గాను డి.సంజన 976 మార్కులు సాధించారు. కళాశాలల ఫౌండర్, చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పటిష్టమైన ప్రణాళికతో నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఇలాంటి ఫలితాలు సాధించడం సాధ్యమైందని, రానున్న కాలంలో మరింత ఉన్నతమైన విద్యార్థులను తయారు చేయడంలో ట్రినిటి విద్యాసంస్థలు ముందుంటాయని తెలిపారు. చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థి నందాల సాయికిరణ్ యూపీఎస్సీ పరీక్షలో ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించారని తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ప్రాణాలు తీసిన మధ్యవర్తిత్వం

- వేధింపులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య


ప్రసాద్(ఫైల్)

గోదావరిఖని: ఉద్యోగం కోసం వహించిన మధ్యవర్తిత్వో వ్యక్తి ప్రాణాలు తీసింది. వన్‌టౌన్ ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. స్థానిక సీతానగర్‌కు చెందిన చందా ప్రసాద్ (44) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 2014లో మేకల యుగందర్.. పుట్ట సతీశ్‌కు ఉద్యోగం పెట్టించేందుకు రూ.3లక్షలకు మాట్లాడుకున్నారు. ఇందులో మధ్యవర్తిగా ప్రసాద్ వ్యవహరించాడు. అప్పటి నుంచి మేకల యుగంధరకు సింగరేణిలో ఉద్యోగం పెట్టించలేదు. డబ్బులు కూడా వాపస్ ఇవ్వలేదు. మధ్యవర్తిగా ఉన్న ప్రసాద్‌ను ఉద్యోగం కోసం ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని పుట్ట సతీశ్ బూతులు తిట్టాడు. గతంలో మరో భూవ్యవహారంలో ఖనికి చెందిన మట్ట యుగందర్ రెడ్డి, జంగేటి రవికుమార్ ప్రసాద్‌వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశారు. ఉద్యోగం కోసం ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని ఈనెల 22న రాత్రి పుట్ట సతీశ్, అతని భార్య పుట్ట మౌనిక, తండ్రి పుట్ట కనకయ్య, తల్లి పుట్ట పూలమ్మ కలిసి చందా ప్రసాద్ ఇంటికి వచ్చి బూతులు తిట్టారు. అవమానం భరించలేక ఈ నెల 23న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. పుట్ట సతీశ్, పుట్ట మౌనిక, పుట్ట కనకయ్య, పుట్ట పూలమ్మ, మట్ట యుగందర్‌రెడ్డి, జంగేటి రవికుమార్ పేర్లను మృతుడు సూసైట్ నోట్ రాశాడు. మృతుడి భార్య చందా శ్రీలత ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశారు.

రూ.7,95,960 నగదు పట్టివేత

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ వద్ద రాజీవ్ రహదారిపై ఓ వ్యక్తి నుంచి రూ.7,95,960 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ తన సిబ్బందితో బుధవారం మేడిపల్లి సెంటర్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇందిరమ్మకాలనీకి చెందిన కల్లెపల్లి ఓదెలు అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని ఆపి బ్యాగు తనిఖీ చేయగా రూ.7,95,960 నగదు లభించింది. దీనికి సంబంధించిన ఆధారాలు ఏమీ చూపించకపోవడంతో ఎఫ్ఎస్‌టీ సిబ్బందికి సమాచారం అందించారు. పట్టుకున్న నగదును ఎఫ్ఎస్‌టీ బృందం స్వాధీనం చేసుకుంది.

బసంత్‌నగర్‌లో రూ.1.59లక్షలు..

పాలకుర్తి(రామగుండం): కన్నాల టోల్‌ప్లాజా వద్ద రాత్రి వాహనాల తనిఖీల్లో రూ.1,59,400 నగదు పట్టుకుని సీజ్ చేసినట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అనెపురం గ్రామానికి చెందిన బానోతు శీను వద్ద రూ.59,400, మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఈదునూరి నారాయణ వద్ద రూ.లక్ష నగదు లభించిందని, వీటికి ఆధారాలు చూపించకపోవడబంతో సీజ్‌చేసి ఎన్నికల అధికారులకు అందజేసినట్లు ఎస్సై వివరించారు.

వేధింపులు భరించలేక వ్యాపారి ఆత్మహత్య


శంకరయ్య(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): నందిమేడారం గ్రామానికి చెందిన వస్త్రవ్యాపారి లసెట్టి శంకరయ్య(53) ఆర్థిక లావాదేవీల విషయంలో వేధింపులు భరించలేక మంగళవారం రాత్రి గ్రామ శివారులోని మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన దేవి భూమయ్యకు లసెట్టి శంకరయ్య రూ.2లక్షలు అప్పుగా ఇచ్చాడు. తన డబ్బులు తనకు ఇవ్వాలని భూమయ్యను శంకరయ్య పలుమార్లు అడిగాడు. ఈ విషయంలో ఇదే గ్రామానికి చెందిన గడ్డం రాజిరెడ్డి, గడ్డం శ్యాంసుందర్‌రెడ్డి, దేవి కొమురేశ్, సందనవేని పవన్, సామంతుల నర్సింగం జోక్యం చేసుకుని.. అప్పు విషయంలో శంకరయ్యను మానసిక వేధించారు. దీంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య విజయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

చెట్టుకు అంటుకున్న మంటలు


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులోని ఓ పెద్ద చెట్టుకు బుధవారం సాయంత్రం నిప్పంటుకుంది. స్థానికులు 100 డయల్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించారు. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెట్టు పక్కన విద్యుత్ తీగలు ఉండటంతో విద్యుత్ అధికారులకు సమాచారం అందించి సరఫరా నిలిపివేయించారు. ఆ తర్వాత మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు నుంచి ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ వరకు ఎండిన చెట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

'ఎస్‌ఆర్' సంచలనం


విద్యార్థులను అభినందిస్తున్న తిరుపతి

తిమ్మాపూర్: ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్ ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలల విద్యార్థులు సంచలనం సృష్టించారు. జిల్లాలోని ఆరు బ్రాంచ్‌లకు చెందిన ఫస్ట్, సెకండియర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాలల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గుజ్జుల సాయిమణిదీప్‌రెడ్డి 992 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో ర్యాంకు పొందగా, జిల్లాలో అగ్రస్థానంలో నిలిచాడు. కన్న మణిదీప్, సీహెచ్ హన్సిక 991మార్కులు, ఎన్.వైష్ణవి, నామసాని వినూత్న, టి.ప్రభాస్ 990మార్కులు సాధించారు. ఎంపీసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో 470మార్కులకు పోగుల ఆశ్రిత్ 468మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచాడు. బండ అక్షయ, సామర్ల దీక్షిత్, టి.సంధ్య, సీహెచ్.కావ్య, ఈ పావని, కె.వినీల, యూ.శ్రీమై 467మార్కులు సాధించారు. మరో 29మంది 466 మార్కులు సాధించారు. 460పైన సుమారు 100మంది విద్యార్థులకుపైగా ఉన్నట్లు తిరుపతి తెలిపారు. బైపీసీ మొదటి సంవత్సరంలో కళాశాలలకు చెందిన కె.జాహ్నవి, ఎన్.పూజిత, పి.శ్రీహాసిని 436 మార్కులు సాధించి రాష్ట్రర్యాంకులు పొందారు. డి.ప్రత్యూష 435 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాళ్లు నాగార్జునరెడ్డి, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, మారుతి, డీన్ రవీందర్‌రెడ్డి, అశోక్, అధ్యాపకులు సన్మానించారు.

సత్తాచాటిన శ్రీ చైతన్య


విద్యార్థులను అభినందిస్తున్న విద్యా సంస్థల అధినేత రమేశ్‌రెడ్డి

కరీంనగర్: ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో భూక్య హారిక 988, జి.మహాలక్ష్మి 988, బైపీసీలో ఎం.వివేక్ 987, ఎంఈసీ లో టి.హారిక 965, సీఈసీలో జె.ప్రశాంత్ 972 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఆర్.వైష్ణవి 468మార్కులు, జి.శ్రీనిత్య, బి.వర్షిత్, బి.అక్షర, ఎస్. విష్ణువర్ధన్‌లు 467మార్కులు, 14 మంది విద్యార్థులకు 466 మార్కులు సాధించారు. బైపీసీలో ఎస్.భార్గవి, ఎస్.మేఘన శ్రీ, ఎ.అభ్యుదయ 436 మార్కులు, జి.మధుహాసిని 435, ఎంఈసీలో ఆర్.హన్సిక 473, సీఈసీలో ఎ.మధుమిత 484 మార్కులు సాధించారు. వీరిని విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేశ్‌రెడ్డి సత్కరించారు. డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాక్రిష్ణ, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఎస్‌వీజేసీ' విజయదుందుబి


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ ఫలితాలలో ఎస్‌వీజేసీ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఫస్టియర్‌లో బైపీసీ ఈ.దిలీప్(438), ఎంపీసీ టి.లిఖిత్‌గౌడ్(467), ఎంఈసీ వినయ్(488), సీఈసీ ఎం.వైష్ణవి(481), టి.కల్యాణి (466), పి.లిఖిత(466), ఎం.స్ఫూర్తి(465), ఎస్.లావణ్య(465), సీహెచ్.తేజరామ్(465), కె.అక్షర(463), కె.కార్తీక్(463), ఎస్.రక్షిత(463), ఎన్.వర్షిత(463), పి.అనన్య(463), బైపీసీలో ఈ.దిలీప్(438), ఈ.హర్షిత(436), స్ఫూర్తి(435), కె.రోహిణి(433), జె.పద్మశ్రీ(433), ఎస్.రిషిత(433), ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జి.గణేశ్(989),జె.సంతోష్(989), బి.రాహుల్(989), జి.సాయి భువన(988), జె.హర్షిత(987), ఏ.అంజుశ్రీ(986), ఎం.శ్రీరామ్(986)మార్కులు సాధించారు. వీరిని డైరెక్టర్లు మహిపాల్, వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోశ్‌రెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

'సాన్వీ' జయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న సాన్వీ కరస్పాండెంట్లు మునీందర్, ప్రసాద్

కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తి సాన్వీ డిఫెన్ అకాడమీ, జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో జయకేతనం ఎగురవేసినట్లు యాజమాన్యం ఎర్రంశెట్టి మునీందర్, సిరిపురం ప్రసాద్ తెలిపారు. ఇంటర్ సెకండియర్‌లో పొగాకు విశాల్ 985, దిడ్డి సాయిచరణ్ 979, విజ్ఞాన్ రెడ్డి 978, నస్పూరి ప్రసిదేర్ 976, లాడే అభిలాష్ 968, ఈశ్వర్ 959 మార్కులు సాధించగా, ఫస్టియర్‌లో రాచకొండ రాజు, శివరాం గౌడ్, రాజకుమార్, మనిచరణ్ తేజలు 464,458,457 మార్కులు సాధించారన్నారు.

రేకులను ఢీకొట్టిన కారు


రేకులను ఢీకొని ఆగిన కారు

జూలపల్లి(పెద్దపల్లి): మండల కేంద్రంలో కారు బీభత్సం సృష్టించింది. పెద్దాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతరకు వచ్చిన భక్తుడు, పెద్దాపూర్ గ్రామానికి చెందిన పెసరు మధు కారును అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో అదుపుతప్పింది. మెయిన్‌రోడ్డుపై ఉన్న సంబారి వెంకటేశం కిరాణం ఎదుట ఉన్న రేకులను ఢీకొట్టి ఇంటి ఆవరణ ఎదుట ఆగిపోయింది. ఈ ఘటనలో రేకులతో పాటు సిమెంటు స్తంభాలు ధ్వంసమయ్యాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. అజాగ్రత్తగా కారు నడిపిన వారిపై ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు ఇవ్వనందున కేసు నమోదు కాలేదన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ సుభాష్‌నగర్ సమీపంలోని రాజీవ్ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడింది. బుధవారం కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. గోదావరిఖనికి చెందిన దాసరి దేవరాజ్ తన కుటుంబసభ్యులతో కారులో వస్తున్నారు. అది అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. స్థానికులు కారులోని వారిని బయటకు తీశారు. ముగ్గురికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ లాడ్జిలో 8మంది పేకాటరాయుళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రాత్రి సింధూర కళాశాల రోడ్డులోని ఓ పెద్ద లాడ్జిలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేశారు. ఈ క్రమంలో 8మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి సుమారు రూ.రెండు లక్షలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం ఎన్టీపీసీ పోలీసులకు అప్పగించారు.